సాక్షి నిజామాబాద్

ఆదివారం । 14 । జనవరి । 2024



పేకాట @ కుర్నాపల్లి

పేకాటరాయుళ్లు హైటెక్ జూదం ఆడుతున్నారు. అడవుల్లోని రహస్యప్రాంతాల్లో విందులు వినోదాల పేరుతో జల్సా చేస్తున్నారు.

- 8లో ▸



మోడల్ స్కూల్ పిలుస్తోంది..

ఆంగ్ల మాద్యమంలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు మోడల్ స్కూళ్లు వరంలాగా మారాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /19.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం నుంచి చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్ సీరియస్..!

- జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో డెకరేషన్ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం : జీజీహెచ్‌లోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ఫంక్షన్‌హాల్‌లో మాదిరిగా జన్మదిన సంబురాలు నిర్వహించడంపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా కలెక్టర్ సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో శనివారం చాంబర్‌ను డెకోరేషన్ తొలగించి పూర్తిగా శుభ్రం చేశారు. ఎప్పటిలాగే కుర్చీలు సర్దిపెట్టారు. బర్త్‌డే సందర్భంగా సిబ్బంది అంతా విధులు వదిలేసి సంబురాల్లో పాల్గొనడంపై రోగుల బంధువులు అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే.

జడ్జికి 'అయోధ్య' అక్షింతల అందజేత



నిజామాబాద్ సిటీ : అయోధ్య శ్రీరామ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను జడ్జి కుంచాల సునీత, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, టీఎన్జీవో అధ్యక్షుడు అలుక కిషన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్ కదం, జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్, కోశాధికారి నాంపల్లి శేఖర్, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు శ్రీనివాస్, నగర కార్యదర్శి రాంప్రసాద్ చటర్జీ,రవి పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కవితకు ఇవ్వాలి



ఖలీల్ వాడి : బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఎమ్మెల్సీ కవితకు ఇవ్వాలని నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 ఎన్నికల్లో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటుగా 420 హామీలు ప్రజలకు అందేవరకు బీఆర్ఎస్‌పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. నాయకులు సుజిత్ సింగ్ ఠాగూర్, మురళి, రాజు, సత్యప్రకాశ్ ఉన్నారు.

పల్లెకు సంక్రాంతి శోభ



- లోగిళ్లలో రంగవల్లులు
- పట్టణాల నుంచి సొంతూళ్లకు..
- ఘుమఘుమలాడే పిండివంటలు
- కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

వర్ని: మూడ్రోజుల పాటు జరిగే సంక్రాంతి శోభ పల్లెల్లో ఉట్టిపడుతోంది. పండగకు మహిళలు, పిల్లలు, పెద్దలు అన్ని రకాల సంబరాలకు సిద్ధమయ్యారు. మహిళలు వారం రోజుల ముందుగానే పిండి వంటలను తయారు చేశారు. సకినాలు, అప్పాలు, బూందీ, బూరెలు చెక్కలు తదితర వంటకాలను సిద్ధం చేశారు. శని, ఆది, సోమ వారాల్లో జరిగే భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా.. హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్ర, విదేశాల నుంచి వర్ని తదితర మండలాల్లోని సొంత గ్రామాలకు చేరుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్నేహితులతో కలిసి ఆడుతూ పాడుతూ పండుగను సంబరంగా నిర్వహించుకుంటున్నారు. యువతులు, మహిళలు లోగిళ్లలోల రంగురంగుల ముగ్గులతో అలంకరిస్తున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గిగి పీడకలను తయారుచేసి పిల్లల మెడలో వేసి సంబరాలు నిర్వహిస్తున్నారు.



సత్యనారాయణపురంలో..



వర్ని వీధుల్లో రంగులు అమ్ముతున్న చిరు వ్యాపారి

కలర్లకు భలే గిరాకీ

సంక్రాంతి సందర్భంగా మహిళలు తమ ఇంటి ముంగిళ్లలో వేసే ముగ్గుల కోసం వివిధ రకాల కలర్‌లకు భలే గిరాకీ ఉంది. తోపుడుబండ్లపై గ్రామాల్లో 10 నుండి 15 రకాల రంగురంగుల కలర్‌లను చిరు వ్యాపారాలు విక్రయిస్తున్నారు. పండుగ సమయంలో కలర్లు విక్రయించడంతో తమకు మంచి ఆదాయం లభిస్తున్నట్లు వ్యాపారులు ఈ సందర్భంగా వెల్లడించారు.



నెహ్రూనగర్‌లో పిండి వంటలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి స్పెషల్ 'ఘేవర్'

- భైంసా టూ ఇందూర్

నిజామాబాద్ సిటీ: రాజస్థానీ ఘేవర్ స్వీట్ అనగానే భైంసా గుర్తుకు వస్తుంది. ఈ రకమైన స్వీట్ ఇప్పటివరకు కేవలం భైంసాలో లభ్యం అవుతుండటంతో దీని రుచికొరకు భైంసా వరకు వెళ్లి తెచ్చుకునేవారు. తాజాగా ఘేవర్ స్వీట్ జిల్లా కేంద్రంలోని పలు స్వీట్స్ దుకాణాలలో అందుబాటులో ఉంచారు. ఈ రకమైన స్వీట్ తెలంగాణలో ఎక్కడా కనిపించని రాజస్థానీ మిఠాయి ఘేవర్ ప్రతి సంక్రాంతికి నోరూరిస్తుంది. మైదాపిండి, వనస్పతి, పాలు, నెయ్యి, చక్కెరతో తయారయ్యే ఈ మిఠాయిని దాదాపు 45 సంవత్సరాల క్రితం భైంసా పట్టణ వాసులకు రాజస్థాన్ రాష్టానికి చెందిన మోహన్‌లాల్ పరిచయం చేశారు. భైంసాలో తయారు చేసే ఘేవర్ స్వీట్‌ను నిజామాబాద్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. నగరవాసులు దీనిని ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పండుగ సమయంలో ఘేవర్ స్వీట్‌ను ప్రత్యేకంగా తయారు చేస్తామని నగరంలోని గంజ్ మార్కెట్‌లో గల దుకాణదారు రాజు తెలిపారు. తమ వద్ద మూడు రకరాల ఘేవర్ స్వీట్లు తయారు చేస్తామన్నారు. సాధారణ ఘేవర్ కిలో రూ. 300, మలై ఘేవర్, షుగర్ లెస్ ఘేవర్ రూ.500, నెయ్యితో తయారు చేసిన ఘేవర్ రూ. 650లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.



రైతునగర్‌లో సందడి

బాన్సువాడ : దేశ విదేశాల్లో స్థిరపడ్డా వారందరూ పండుగకి సొంతూరికి రాడవం ఈ గ్రామవాసుల ప్రత్యేకం. ఊరంతా కలిసి పండుగ జరుపుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంటుంది. బీర్కూర్ మండలం రైతునగర్‌లో సంక్రాంతి సంబురాలు ప్రతీ ఏడాది వైభవంగా నిర్వహిస్తారు. జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో పండుగను అందరూ కలిసి సంతోషంగా జరుపుకుంటారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం బాలనగర్‌లో విధులు నిర్వహిస్తున్న అడిషనల్ డీసీపీ పాలెటి సత్యనారాయణ ఆధ్వర్యంలో 10 ఏళ్ల క్రితం జన్మభూమి ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో బాగా స్థిరపడ్డా వారందరూ ఎంతో కొంత పోగు చేసి సంక్రాంతి పండుగ రోజుల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



రైతునగర్‌లో పిండి వంటలు చేస్తున్న మహిళలు

భోగభాగ్యాల భోగి

వర్ని: సంక్రాంతి పండగలో మొదటి రోజైన భోగి విశిష్టత సంతరించుకుంది. పాడిపంటలకు చీడపీడలు ఆశించకుండా ఉండేందుకు భోగిమంటలు వేస్తారు. ఇంట్లో ఉన్న వస్తువులను భోగి మంటల్లో వేసి ఇప్పటివరకు తమకు ఉన్న అరిష్టాలను తొలగించాలని కోరుకుంటారు. అరిష్టాలను తొలగించేదే భోగి పండుగని ప్రజలు నమ్ముతారు. భోగి రోజు తెల్లవారుజామున ఇంట్లో ఉన్న వస్తువులను భోగిమంటల్లో వేసి అరిష్టాలు తొలగాలని ప్రజలు కోరుకుంటారు.

సంక్రాంతి విశిష్టత

ఆర్మూర్ : సంక్రాంతి పండుగ విశిష్టత ఏమిటంటే.. ఈ రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. మకర సంక్రమణం జరిగింది కనుక దీనిని మనం మకర సంక్రాంతి అని పిలుచుకుంటాం. సంక్రాంతి పండుగ తరుచుగా జనవరి 14 లేదా 15 వ తేదీల్లో వస్తుంది. సంక్రాంతికి ముందు రోజు వచ్చే పండుగ భోగి సంక్రాంతి తరువాత వచ్చే పండుగ కనుమ ఈ పండుగను హిందువులు వివిధ రాష్ట్రాల్లో పేర్లు వేరైనా చాలా పవిత్రంగా జరుపుకుంటారు.

ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మ లతో స్వాగతం పలుకుతాయి. వేకువ జామున హ రినామ సంకీర్తనలతో హరిదాసు నెలంతా వస్తూ ప్రజలను భక్తి మార్గంలోకి మళ్లిస్తాడు. గంగిరెద్దులు, కోడి పందాలు, ఎడ్ల పందాల మాట సరేసరి. ఒక్కమాటలో చెప్పాలంటే మన తెలుగు సంప్రదాయం మొత్తం ఈ పండుగలో ప్రతిబింబిస్తుంది.



చిన్నారికి బుడుబుడుకలు పోస్తున్న దృశ్యం

పతంగుల పండగ..



ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకొనే పండగ సంక్రాంతి కావడంతో పిండి వంటలు తింటూ పిల్లలు పతంగులు ఎగరేయడం ఆనందాన్ని ఇస్తుంది. సెల్‌ఫోన్, ఇంటర్నెట్ యుగం ఎంతగా ప్రభా వితం చేసినా చిన్నారులు పతంగులు ఎగరవేస్తూ తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు.

– మౌనిక, గృహిణి, ఆర్మూర్

రైతుల పండగ..



రైతులు శ్రమించి పండించిన పంటలు ఇంటికి చేరిన సందర్భంగా జరుపుకొనే పండగ సంక్రాంతి. భోగి, సంక్రాంతి, కనుమలను ఆయా రోజుల విశిష్టతలను బట్టి ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– జయలక్ష్మి, గృహిణి, ఆర్మూర్

కుటుంబ సభ్యులతో గడిపేందుకు..



అతి పెద్ద పండుగ అయిన సంక్రాంతిని కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకునేందుకు యూఎస్ నుంచి వచ్చాను. పండగ కోసం 15 రోజుల ముందు గానే మా స్వగ్రామమైన శ్రీనగర్‌కు చేరుకున్నాను. స్నేహితులతో పండుగను ఆనందంగా జరుపుకుంటాను.

– కొడాలి నందిని, యూఎస్ (శ్రీనగర్)

రకరకాల పిండి వంటలను తయారు చేశాం



పండగ కోసం ప్రత్యేకంగా వివిధ రకాల పిండి వంటలను గత వారం నుంచి తయారు చేస్తున్నాం. సకినాలు, కారా బూంది, పొంగలి, చేతి చెకోడీలు, బొబ్బట్లు వంటి పిండి వంటకాలను సిద్ధం చేశాము. కుటుంబసభ్యులతో సంబురాలు ఘనంగా జరుపుకుంటాము.

– సుజాత, నెహ్రూనగర్

ప్రతి సంక్రాంతికి వస్తాం



సంక్రాంతిని సొంతూళ్లో జరుపుకుంటే ఆ అనుభూతే వేరు. చాలాకాలంగా ప్రతీ ఏడాది గ్రామానికి వచ్చి సంక్రాంతి సంబురాల్లో పాల్గొంటున్నా. ఈసారి కూడా కుటుంబంతో కలిసి వచ్చా. పిల్లలకు సొంతూరి జ్ఞాపకాలను చూపిస్తాం. వారు సంతోషంగా గడుపుతున్నారు.

– ధీరజ్, రాధామానస, లండన్(రైతునగర్)

మిల్లర్లపై కేంద్ర విజిలెన్స్ విచారణ జరపాలి

- మిల్లర్లతో అధికారుల కుమ్మక్కు
- సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీకి మాజీ ఎమ్మెల్యే యెండల వినతి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రైస్‌మిల్లుల్లో జరుగుతున్న మోసపూరిత కార్యకలాపాలు, అవినీతి అక్రమాలు బహిర్గతం చేయడానికి ఏకకాలంలో కేంద్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. రైస్‌మిల్లుల్లో జరుగుతున్న బాగోతాలను ఆధారాలతో సహా వివరించారు. రైస్‌మిల్లర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కైనట్లు బలమైన ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా తమ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసుకుని పరోక్షంగా లబ్ధి పొందారన్నారు. ఆ అవినీతి మరక ప్రభావం నిజాయితీ గల మిల్లర్లపై పడుతోందని, తద్వారా వారు నష్టాలను చవిచూస్తున్నారన్నారు. ఇదే ఆసరాగా చేసుకుని కష్టాల్లో ఉన్న మిల్లులను రాజకీయ నాయకులు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. స్టాక్ పొజిషన్ అంచనా వేయడానికి, ఏదైనా మోసపూరిత కార్యకలాపాలను బహిర్గతం చేయడానికి కేంద్ర విజిలెన్స్ విచారణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లులకు వరి ధాన్యం కేటాయింపులో పక్షపాతంగా కన్పిస్తోందని, మిల్లు సామర్థ్యం కంటే రాజకీయ సంబంధాలు ఉన్న వారికి కేటాయింపులు అధికంగా ఇస్తున్నారన్నారు. 25శాతం జరిమానా జీవో జారీ చేయడం కూడా అలాంటి పద్ధతులను నిరోధించలేదని, మిల్లర్లు గిడ్డంగి స్థలం లేదని తప్పుగా క్లెయిమ్ చేస్తున్నారని ఆరోపించారు.

టెండరింగ్ ప్రక్రియలో చిత్తశుద్ధిని దెబ్బతీసి అవకతవకలకు పౌరసరఫరాలశాఖ మద్దతిస్తోందన్నారు. రైస్‌మిల్లులు, సీఎంఆర్ డెలివరీ, రవాణా సౌకర్యం, స్టాక్ పొజిషన్, ధాన్యం కేటాయింపుల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి పరిస్థితిని చక్కదిద్దేలా చర్యలు తీసుకోవాలని యెండల పేర్కొన్నారు.

ప్రభుత్వ టీచర్లపై ఇంటలిజెన్స్ ఆరా!

- దుమ్మాలు.. వ్యాపారాలపై సమగ్ర నివేదిక తయారు చేస్తున్న అధికారులు
- అక్రమ డిప్యుటేషన్లు, సస్పెన్షన్లు, ఎత్తివేతలపై రహస్య విచారణలు

నిజామాబాద్‌అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లపై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లుగా తెలిసింది. కొన్నిరోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖపై లోతైన సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల పనితీరు ఎలా ఉందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రిపోర్ట్ ఇవ్వాలని ఇంటలిజెన్స్‌ను ఆదేశించినట్లు సమాచారం. వివిధ టీచర్ల సంఘాల నా యకులపై దృష్టి సారించినట్లు తెలిసింది. పది రోజులుగా వారి పనితీరు, విద్యాబోధనపై నిఘా వేసినట్లు సమాచారం. విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లు, పాఠశాలలకు దుమ్మాలు కొట్టేవారి విషయంపై పరిశీలిస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 1,724 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 4,250 మంది టీచర్లు పనిచేస్తున్నారు. కొందరు టీచర్లు సంఘాల నాయకులుగా కొనసాగుతున్నారు. ఓ ప్రధాన సంఘ నాయకుడు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పూర్తిగా నిమగ్నమైనట్లు పాఠశాలకు వెళ్లకుండా రెండేళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. నవీపేట మండలంలో మరో టీచర్ ప్రైవేట్ ఆస్పత్రులకు సంబంధించి వ్యాపారం కొనసాగిస్తున్నారు. నగరంలోని ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు గతంలో ఓసారి సస్పెన్షన్‌కు గురైనప్పటికీ సమావేశాల పేరుతో దుమ్మాలు కొడుతున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. సిరికొండ, కమ్మర్‌పల్లి భీమ్‌గల్ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు పాఠశాలకు అలా వెళ్లి ఇలా వస్తున్నట్లు సమాచారం. భీంగల్ మండలంలోని ఓ ఉపాధ్యాయుడు గ్రూప్స్ ప్రిపరేషన్ పేరుతో అధికారుల అనుమతి లేకుండానే సెలవుల్లో కొనసాగుతున్నట్లు తెలిసింది. భీంగల్ మండల కేంద్రంలో మరో ఇద్దరు ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో ఉంటూ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు మోడల్ స్కూల్, కేజీబీవీల ఉద్యోగుల సమస్యల పేరుతో తరచూ పాఠశాలకు దుమ్మాలు కొడుతున్నట్లు తెలిసింది. చాలాచోట్ల జియో అటెండెన్స్ అభాసుపాలవుతోంది.

సర్దుబాటు పేరుతో..

జిల్లాలో సుమారు 60 నుంచి 70 వరకు అక్రమ డిప్యుటేషన్లు ఉన్నట్లు వారి నివేదికలో తేలినట్లు తెలిసింది. మండలాల్లో ఆయా ఎంఈవోలు ఇష్టానుసారంగా అడ్జెస్ట్మెంట్ పేరుతో అక్రమ డిప్యుటేషన్లు కొనసాగించారు.

వర్ని మండలంలో 18 అక్రమ డిప్యుటేషన్‌లు కొనసాగుతున్నాయని, ఉపాధ్యాయ సంఘం నాయకుడి ఒత్తిడి మేరకు ఈ అక్రమ డిప్యుటేషన్లు చేసినట్లు తెలిసింది. సరిహద్దు ప్రాంతాలను వదిలి జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న పాఠశాలలకు ఎక్కువగా డిప్యుటేషన్లు కొనసాగినట్లు అధికారులు గుర్తించారు. దీనికి అధికారులు అనుమతి ఉందా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతుంది.

ఇంత అధ్వానమా..?

- అపరిశుభ్రంగా జీజీహెచ్ పరిసరాలు
- ఇబ్బందులు పడుతున్న రోగుల బంధువులు
- భవనానికి ఉన్న పైపుల్లో లీకేజీల కారణంగా దుర్వాసన

జిల్లావ్యాప్తంగా రోగులకు సేవలందించాల్సిన జీజీహెచ్ అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నిత్యం వేలసంఖ్యలో రోగులు వచ్చిపోయే ఆస్పత్రి పరిసరాలు దుర్వాసనతో కంపుకొడుతున్నాయి. రోగులు, వారి బంధువులు మురుగు కారణంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధింత యంత్రాంగం పట్టించుకున్నట్లు కనిపించట్లేదు.



జిల్లా జనరల్ ఆస్పత్రి వెనుకభాగంలో కోవిడ్ సెంటర్‌కు వెళ్లే ప్రాంతంలో అపరిశుభ్రత

నిజామాబాద్ నాగారం : జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆస్పత్రి మేడిపండు చూడు.. మేలిమై ఉండు.. అన్నట్లుగా తయారైంది. జీజీహెచ్ భవనం చుట్టుపక్కన పరిసరాలు దుర్వాసన కారణంగా ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడు అంతస్తుల మేడలోని పైపులైన్లు పాడవడంతో మురుగునీరంతా బయటకు వచ్చి పరసరాలు అధ్వానంగా మారాయి. ఈ మురుగునీరు భవనం నలుదిక్కులా పారుతూ అధ్వానంగా తయారైంది.

■ మురుగు మధ్య తాగునీటి కుళాయి..

జీజీహెచ్‌లో ప్రధాన ద్వారం పక్కనే ఉండే తాగునీటి కుళాయి వద్ద పరిసరాలు చూస్తే భయానకంగా ఉంది. అక్కడ ఆ మురుగునీటిలోనే తాగునీటి కోసం రోగులు, వారి బంధువులు అవస్థలు పడుతున్నారు. మురుగునీళ్లలోనే నిలబడి తాగునీళ్ల బాటిళ్లలో నింపుకుంటున్నారు. అలాగే నిత్యం రోగుల బంధువులకు భోజనాలు అందించే ప్రాంతంలోనూ దుర్వాసనతో అటు వైద్య సిబ్బంది, ఇటు రోగులు అవస్థలు పడుతున్నారు.

■ మురుగుదొడ్లు..

జీజీహెచ్‌లో రోగులకు వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆస్పత్రిలో పై అంతస్తుకు నడుచుకుంటూ వెళ్లేక్రమంలో ర్యాంప్‌కు సపోర్ట్ రాడ్లు ఊడిపోయి నెలలు కావస్తున్నా వాటిని బిగించలేదు. అన్ని వార్డుల్లోని మరుగుదొడ్లు అధ్వానంగా ఉండగా, వార్డుల్లో ఫ్యాన్లు సైతం సక్రమంగా లేవు.



మార్చురీ, ల్యాబ్‌కు వెళ్లే దారిలో..



తాగునీటి కుళాయి వద్ద అపరిశుభ్రత

పర్యవేక్షణ గాలికి..

ఆస్పత్రిలో వసతులను, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం సర్వత్రా చర్చకు దారితీస్తోంది. జీజీహెచ్‌లో అసలు ఏం జరుగుతుందో కూడా ఉన్నతాధికారులకు తెలియదేమో అన్నట్లు పరిస్థితి తయారైందని రోగుల బంధువులు చర్చించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ శానిటేషన్‌ను గాడిలో పెట్టాల్సిన అధికారులు ఆ విషయంలో శ్రద్ధ చూపట్లేదని తెలుస్తోంది.

క్లుప్తంగా

వరద కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి ఆయకట్టు కోసం వరద కాలువ ద్వారా ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను శనివారం చేపట్టారు. కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800, లక్ష్మికాలువ ద్వారా 250, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, ముంపు గ్రామాల లిఫ్టులకు 312, ఆవిరి రూపంలో 365 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1083.70 అడుగుల నీటి మట్టం ఉందని అధికారులు పేర్కొన్నారు.

జిల్లా ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి అర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అనుబంధంగా ఉన్న ఆటో యూనియన్ జిల్లా కార్యవర్గం శనివారం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా బి.సురేందర్‌రావు, ఉపాధ్యక్షులుగా టి.బుగ్గరాములు, బీరప్ప యాదవ్, అలుగనూరి మహేందర్, ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రాజేందర్, కార్యదర్శులుగా బి.బాలరాజు, సిద్ధిరాములు, జి.రవికుమార్, సాయిలు, సంఘటన కార్యదర్శిగా గద్దం బాలయ్య, కోశాధికారిగా పైడి శ్రీనివాస్, కార్యాలయ కార్యదర్శిగా వడ్ల జీవన్, కార్యవర్గసభ్యులుగా ముల్క రవి, ఆర్.అనిల్‌కుమార్, వై.మహేందర్, హెచ్.అనిల్, బి.దశరథం, ఎం.నారాయణ, ఆర్.విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

సైబర్ వలలో ఉద్యోగి

బోధన్‌టౌన్: పట్టణంలోని ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వహిస్తున్న షాకీర్‌అలీ సైబర్ మోసానికి గురైనట్లు సీఐ వీరయ్య శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరానికి చెందిన షాకీర్ అలీ బోధన్‌లోని ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎస్‌బీఐ ద్వారా పొందిన క్రెడిట్ కార్డులో రివార్డు పాయింట్స్‌ను తన ఫోన్‌లో చెక్ చేసుకుంటుండగా మెసేజ్ వచ్చిందని అందులో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి అడిగిన వివరాలను నమోదు చేయగా క్రెడిట్ కార్డు నుంచి విడతల వారీగా రూ. 70 వేలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు బ్యాంకును సంప్రదించి క్రెడిట్ కార్డును బ్లాక్ చేయించాడు. షాకీర్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నగదు రహిత వైద్యాన్ని అందించాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఎలాంటి వాటా (కంట్రిబ్యూషన్) లేకుండా నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో అందించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్-రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి కోరారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పెన్షనర్లను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేయడంతో ఫలితం అనుభవించిందని అన్నారు. డీఏల విడుదల, పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే సంఘాలతో సంప్రదింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు శాస్త్రుల దత్తాత్రేయరావు, జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, మదన్మోహన్, నారాయణ, లావు వీరయ్య, భోజారావు, లక్ష్మీనారాయణ, అశోక్, రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగలో ఔషధ'నిధి'

- సంక్రాంతితో సకల సంపదలు
- తెలుగు ప్రజలు జరుపుకొనే పెద్ద పండుగ ఇదే..

బోధన్‌రూరల్: మన దేశంలో ప్రత్యేకతలకు పెట్టింది పేరు తెలుగు పండుగలు. ప్రకృతిలో ఉండే అనేక సంస్కృతులు, ఔషదాల గొప్పతనాన్ని ఇవి చాటుతుంటాయి. ఒక్కో పండుగకు ఒక్కో శాస్త్రీయ కోణంతో ప్రత్యేకత ఉంటుంది. అందులో అతి ప్రత్యేకమైనది సంకాంత్రి పండుగ..

సూర్యుడు మకరరాశిలో మారే కాలంలో బంతి, చామంతి పూలు, రేగిపండ్లు, మిరపపళ్లు పుష్కలంగా దొరుకుతాయి. ముంగిళ్లలో రంగులు, రంగవల్లులు వేసి వాటిని ఆవు పేడతో గొబ్బెమ్మలు, వాటిలో గరికపోచలు, పిండి కొమ్ములు (ఉత్తరేణి), తంగేడు కొమ్ములు, వాటికి పసుపు అంటించి పువ్వులతో అలంకరిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గుల్లో సజ్జలు, జొన్నలు, బియ్యం పిండిని వాడుతారు. సంకాంత్రి ముందు రోజు భోగి నాడు మూడేళ్ల లోపు పిల్లలకు గ్రహణ పీడలు, శని తొలగి సకల ఐశ్వర్యాలతో ఉండాలని కోరుతూ రేగిపండ్లు పోస్తారు. గోబిళ్ల చుట్టూ ధాన్యాలు పోసి పశు పక్ష్యాదులకు ఆహారంగా అందిస్తారు. మరుసటి రోజు సంకాంత్రి నాడు కొత్త బియ్యం, బెల్లం, నువ్వులతో పులగం వండుకుంటారు. ఇలా సంకాంత్రి పండుగ సమయంలో చేసే పనులన్నింటి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది. పూర్వకాలంలో మన పెద్దలు రాబోయే వైరస్‌లు, వ్యాధులను ముందుగా గ్రహించి వాటికి అనుగుణంగా ముందస్తుగా జాగ్రత్తలు పాటించేవారు. అలా మన పెద్దలు ముందస్తుగా పాటించే జాగ్రత్తలను పండుగలు, పర్వదినాన్ని బట్టి ప్రకృతిలోని ఔషదాలు, పదార్థాలను వినియోగించేవారు. అలాగే సంకాంత్రి పండుగలో సైతం అనేక ప్రత్యేకమైన ఔషదాలు, సహజసిద్ధ పదార్థాలను వినియోగించేవారు.

ప్రకృతిలో లభించే వరి, శనగలు, మినుములు, నువ్వులు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు, ఉలవలు వంటి రకరకాల ఆహార పదా ర్థాల్లో అనేక ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. మన పూర్వీకుల నుంచి వస్తున్న సంకాంత్రి సంప్రదాయాలు, ప్రత్యేకతలపై సంకాంత్రి సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..



గొబ్బెమ్మలు

గొబ్బెమ్మలు..

- ఆవుపేడతో తయారు చేయడంతో క్రిమిసంహారకంగా పనిచేస్తుంది.
- ప్రకృతి కాలుష్య నివారిణి
- ఉష్ణ ఉత్పత్తి ఉపయోగాలు అధికం

గరక..



- గరకలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి
- పచ్చి గరకను మెత్తగా నూరి గాయాలపై పూస్తే మానిపోతాయి
- ప్రకృతి సమతుల్యతను కాపాడుతుంది
- దగ్గు, ఆయసం, మలబద్దకాన్ని నివారిస్తుంది.

పిండి కొమ్ములు (ఉత్తరేణి)..



- ఉత్తరేణి పుల్లలతో పళ్లు తోముకుంటే దంతాక్షయం తొలగుతుంది.
- జీర్ణ వ్యాధులు, త్రిదోశ, ఉదరవ్యాధుల నివారిణి
- పైత్యరసం ఉత్పత్తిలో ప్రాత వహిస్తుంది
- రక్తం వృద్ధి చేస్తుంది

బెల్లం..



- రక్తం వృద్ధి అయ్యేలా పనిచేస్తుంది.
- శరీరంలో ఖనిజ లవణాలను పెంచుతుంది
- శరీరాన్ని కాంతిమయంగా చేస్తుంది
- కోప, తాపాలను తాగిస్తుంది
- సర్వ దోష లక్షణాలను నివారిస్తుంది

రేగి పండ్లు..



- వీటిలో ఔషధ గుణాలు అధికం
- వాతం, మధుమేహం, మూల వ్యాధి నివారిణి
- రక్త శుద్ధి,ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.
- శరీరానికి అవసరమైన వేడి పుట్టించడంతో పాటు చలువ చేస్తుంది
- విటమిన్ 'సీ' పుష్కలంగా లభిస్తుంది

పొంగలిలో..



సంకాంత్రి నాడు చేసే పొంగలికి బియ్యం, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీంతో పాటు పండుగ రోజు పిండితో అరిసెలు చేస్తారు. వీటిలో కూడా పోషక విలువలు అధికంగా ఉంటాయి.

నువ్వులు..



- శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి.
- ఔషధ గుణం ఉంటుంది
- మూత్ర వ్యాధులను తొలగిస్తుంది
- ఎముకల్లో మజ్జ ఉత్పత్తిలో ప్రధాన ప్రాత వహిస్తుంది

బియ్యం..



- కడిగిన బియ్యం నీటిని పంచధారతో సేవిస్తే మూత్ర విసర్జన సాఫీగా ఉంటుంది.
- దప్పిక తగ్గుతుంది, వేసవిలో వడదెబ్బ నుంచి రక్షిస్తుంది.
- త్రిదోషహారిణిగా పనిచేస్తుంది
- శరీరానికి కార్బొహైడ్రేట్లు అధికంగా అందుతాయి.

పేకాట @ కుర్నాపల్లి

- జోరుగా హైటెక్ జూదం
- అటవీ ప్రాంతంలో మకాం వేసిన వైనం
- చేతులు మారుతున్న రూ. లక్షలు
- పట్టించుకోని పోలీసులు

ఎడపల్లి: పోలీసుల కంటపడకుండా ఉండేందుకు పేకాట ఆడేవారు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పేరుతో ఎవరైనా వచ్చి పట్టుకుంటారేమోనని ఆందోళనతో వీరు ఎవరి కంటపడకుండా ఉండేందుకు రహస్య ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లాలోని రూరల్, మోసా, ఎడపల్లి మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో పేకాటదారులు గ్రూపులుగా ఏర్పడి పేకాట కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతాల్లోని గ్రామస్తులకు సైతం అనుమానం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.ఈ ప్రాంతాలకు కార్లలో కాకుండా బైక్‌లపై వస్తూ తమ ఆటను కొనసాగిస్తున్నారు. విందులు, వినోదాల పేరిట గ్రామస్తులు, పోలీసుల కంటపడకుండా రోడ్లపై కొంత మందిని ఏర్పాటు చేసుకొని మరీ అటవీ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. ఈ కేంద్రాల్లో రూ. 10 వేల నుంచి రూ. లక్ష వరకు పేకాట ఆడుతుండడంతో నిత్యం రూ. లక్షలు చేతులు మారుతున్నాయి. ఈ పేకాట కేంద్రాలకు చుట్టు పక్కలలోని 10 గ్రామాల పేకాటదారులు వస్తున్నట్లు సమాచారం.



మూడు మండలాల అటవీ ప్రాంతం..

ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి శివారులో ఉండే అటవీ ప్రాంతం మూడు మండలాలకు చెందిన అటవీ ప్రాంతం కావడంతో పోలీసులు ఈ కేంద్రాలపై దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో పేకాటదారులకు ఈ ప్రాంతాలు అడ్డాగా మారాయి. ఎవరైనా అటవీ ప్రాంతంలోకి రారని, ఒకవేళ ఎవరైనా వచ్చినా ముందస్తుగా తమకు సమాచారం తెలుస్తుందని పేకాటదారులు బహిరంగంగానే పేర్కొంటుండడం గమనార్హం.

పేకాట కేంద్రాల వద్ద వసతులు..

ఈ అటవీ ప్రాంతంలో నిర్వహించే పేకాట స్థావరాల్లో పేకాటలో వచ్చిన డబ్బులతో వారు విందులు, వినోదాలు చేసుకుంటున్నారు. ఒకవేళ పోలీసులు వచ్చినా పారిపోవడానికి అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ అటవీ ప్రాంతాన్ని పేకటదారులు ఎంచుకున్నట్లు సమాచారం.

పోలీసుల పర్యవేక్షణ కరువు..

కొన్ని నెలలుగా ఈ మూడు మండలాలు సరిహద్దు ఉన్న ముత్తకుంట, కుర్నాపల్లి అటవీ ప్రాంతాల్లో పేకాట జోరుగా కొనసాగుతోంది. ఈ ప్రాంతాల్లో హత్యలు జరుగుతున్న పోలీసులు ఇటువైపు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. అంతకాకుండా ఇదే ప్రాంతంలో రెండేళ్ల క్రితం పేకాట ఆడే సమయంలో గొడవ జరగడంతో ఒకరు హత్యకు గురయ్యారు. కానీ ఈ ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ కరువవడం అనుమానాలకు తావిస్తోంది. పేకాటదారులకు పోలీసులు అండగా నిలుస్తున్నారనే ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పేకాటస్థావరాలపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోడల్ స్కూల్ పిలుస్తోంది..

- ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష



డిచ్‌పల్లి మోడల్ స్కూల్

డిచ్‌పల్లి: ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూళ్లు) ఓ వరం. వేలకు వేలు ఖర్చులు పెట్టి, దూరప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువు చెప్పించాలంటే గ్రామీణ ప్రాంతంలోని పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో భారంగా మారేది. ప్రస్తుత తరుణంలో ఆంగ్ల మాధ్యమం చదువుకునేందుకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే ఆదర్శ పాఠశాల(కో-ఎడ్యుకేషన్)లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్న మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుంది. అలాగే 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఒక్కో మోడల్ పాఠశాలలో 100 సీట్లు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 16 ఆదర్శ పాఠశాలలుండగా ఒక్కో పాఠశాలలో 100 సీట్ల చొప్పున 6వ తరగతిలో 1,600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 7-10వ తరగతుల్లో ఆయా పాఠశాలల్లో ఖాళీల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు.

ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష ఫలితాల ప్రకటన తర్వాత సంబంధిత ప్రిన్సిపాళ్లకు మెరిట్ జాబితా అందుతుంది. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, రోస్టర్, స్థానికత ప్రాతిపదికన మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక జాబితా ఖరారు చేస్తారు. మే 25 నుంచి 31వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టి, ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యతోపాటు కొన్నింటిలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, సన్నబియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏటా మెరుగైన ఫలితాలు వస్తున్నాయి.

– దుర్గాప్రసాద్, డీఈఓ, నిజామాబాద్

గుప్త నిధుల తవ్వకాల కలకలం

బోధన్‌రూరల్: మండలంలోని బర్దీపూర్ గ్రామంలో ఉన్న ఓ ఇంట్లో గుప్త నిధుల తవ్వకాలు చేపట్టిన ఘటన శుక్రవారం రాత్రి కలకలం రేపింది. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పీరయ్య అదే గ్రామానికి చెందిన మహేందర్ ఇళ్లు ఖాళీగా ఉండటంతో పీరయ్య కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం పీరయ్య నివాసం ఉంటున్న ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని ఓ వ్యక్తి చెప్పడంతో ఈ విషయాన్ని ఇంటి యాజమాని మహేందర్‌కు పీరయ్య చెప్పాడు. మహేందర్ తనకు పరిచయం ఉన్న సీతారామాచారి (హైదరాబాద్)కు చెప్పాడు. ఈ క్రమంలో పీరయ్య, సీతారామాచారి, మహేందర్ పొలం పనులకు వచ్చే సాయిలుతో కలిసి శుక్రవారం రాత్రి ఆ ఇంట్లో తవ్వకాలు చేపట్టారు. ఇంట్లో తవ్వకాల శబ్దాలు రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగనాథ్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని తవ్వకాలు చేపట్టిన గుంతను పరిశీలించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని ఘటనపై విచారణ చేపట్టి తహసీల్ కార్యాలయంలో శనివారం బైండోవర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



తవ్వకాలు చేపట్టిన ప్రదేశం

కిక్కిరిసిన మేకల సంత



- రూ. 4 కోట్లకుపైగా లావాదేవీలు
- పెరిగిన జీవాల ధరలు

నవీపేట: ఉత్తర తెలంగాణలో పేరుగాంచిన నవీపేట మేకల సంత శనివారం వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. సంతలో తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, వినియోగదారులు క్రయవిక్రయాలు చేపట్టారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కనుమ రోజున నిర్వహించే మాంసాహార విందు భోజనాలకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో ఈ సంతలో విక్రయాలు ఊపందుకున్నాయి. శుక్రవారం రాత్రి నుంచే సంత ప్రాంగణంలో క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. క్రయవిక్రయాల ఊపందుకోవడంతో ఒక్కో జీవానికి రూ. 10 వేల నుంచి 14 వేలకు విక్రయదారులు ధరను పెంచారు. సంతలో రూ. 4 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు నిర్మించాలని రాస్తారోకో

ఎడపల్లి: స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని కోరుతూ మండలంలోని నెహ్రూనగర్ గ్రామస్తులు బోధన్ ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. అశోక్‌సాగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల మృతికి కారణం స్పీడు బ్రేకర్లు, వీధి లైట్లు లేకపోవడమని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మించాలంటూ పలుమార్లు రాస్తారోకో నిర్వహించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఆరవ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించడంతో రాస్తారోకోను విరమించారు. రాస్తారోకోలో సర్పంచ్ అమానుల్లా షరీఫ్, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

లోకహితమే హిందుత్వ లక్ష్యం

సుభాష్‌నగర్: లోకహితమే హిందుత్వ లక్ష్యమని, ప్రపంచాన్ని అమృతత్వం వైపు నడిపించగలిగేది కేవలం హిందుత్వమేనని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి డాక్టర్ అన్నదానం వెంకట సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నగరంలోని దుబ్బలోగల మున్నూరుకాపు కల్యాణమండపంలో శనివారం ఆర్ఎస్ఎస్ నాందేవ్‌వాడ, కంఠేశ్వర్ ఉప నగరాల సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై, మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతి పోకడలు పెరిగిపోవడం వల్లే ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయని, వీటికి సమాధానం కేవలం హిందూ జీవన పద్ధతి మాత్రమేనని తెలిపారు. చిన్ననాటి నుంచే హిందూ కుటుంబంలో ప్రేమ, ఆత్మీయత, త్యాగం వంటి సద్గుణాలను తల్లిదండ్రులు నేర్పుతారని, తద్వారా పిల్లల్లో సామాజిక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. 500 ఏళ్లుగా కోట్లాది మంది భారతీయుల చిరకాల స్వప్నంగా మిగిలిన అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతున్న శుభసందర్భంలో ఈ సంక్రాంతి నిజమైన క్రాంతిని తీసుకొచ్చిందని తెలిపారు. యోగా ప్రభాకర్, నగర సంఘచాలక్ శ్రీనివాస్, నగర సహ కార్యవాహ ఆర్మూర్ దత్తు భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట సుబ్రహ్మణ్యం

క్రైం కార్నర్

మొరం టిప్పర్లు పట్టివేత



మోపాల్: మండలంలోని ఒడ్డెర కాలనీలో అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్న మూడు టిప్పర్లు, జేసీబీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి వాహనాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐలు అంజయ్య, అజయ్ బాబు తెలిపారు. టిప్పర్లను పీఎస్‌కు తరలించి మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నవీపేటలో..

నవీపేట: అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపట్టిన జేసీబీతో పాటు టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. నవీపేట శివారులోని లింగం గుట్ట శివారు నుంచి నవీపేటకు అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో దాడి చేసి వాటిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని అన్నారు.

నవీపేట సంతలో బైక్ చోరీ

నవీపేట: మండల కేంద్రంలో జరిగిన మేకల సంతకు వచ్చిన వినియోగదారుడి బైక్‌ను గుర్తు తెలియని దుండగులు శనివారం చోరీ చేశారు. జన్రాన్‌పల్లికి చెందిన నిఖిల్ తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో తన బైక్‌ను ఉంచి సంతలోకి వెళ్లాడు. మేకల కొనుగోలు పూర్తయ్యాక అక్కడికి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్‌వో



ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్

కామారెడ్డి క్రైం: పట్టణ ఎస్‌హెచ్‌వోగా నియమితులైన చంద్రశేఖర్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పని చేసిన నరేశ్ హైదరాబాద్ సీఐడీ విభాగానికి బదిలీపై వెళ్లగా జిల్లా పోలీస్ శాఖ స్పెషల్ బ్రాంచ్ సీఐగా పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని పట్టణ ఎస్‌హెచ్‌వోగా నియమించింది.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: పొతంగల్ మండలంలోని హెగ్డోలి, చేతన్‌నగర్ గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేసినట్లు కోటగిరి ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. హెగ్డోలిలో రూ. 8880, చేతన్ నగర్‌లో రూ. 5010 నగదును పేకాట ఆడుతున్న వారి నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బోర్లం క్యాంపు తండా శివారులో..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు తండా శివారులోని అటవీ ప్రాంతంలో పేకాటస్థావరంపై దాడి చేసి 7గురుని అరెస్టు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. వీరి నుంచి 7 సెల్‌ఫోన్‌లు, రూ.38వేల 110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980-1982కు చెందిన ఇంటర్ పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తరువాత అందరూ ఒకే చోట కలవడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రంజన్ రతన్, మూర్తి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.